క్లుప్తంగా

గణనాథునికి 150 కిలోల కూరగాయలతో అలంకారం

మైలవరం: మైలవరం కోట వెనుక రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకునికి వినాయక చవితి పండుగ సందర్భంగా 150 కిలోల వివిధ రకాల కూరగాయలతో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు గురువారం అలంకరించారు. కమిటీ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

తిరువూరు: స్థానిక పాతతిరువూరులో వేంచేసిన శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలోని హుండీలలో భక్తులు వేసిన కానుకల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గత ఆరు నెలల్లో హుండీలలో భక్తులు వేసిన కానుకల ద్వారా రూ.2లక్షల 9వేల 801 ఆదాయం లభించినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజరు ప్రసాద్ పర్యవేక్షించారు.

ఆన్‌లైన్లో ఇంటి పన్నుల చెల్లింపులు

తిరువూరు: గ్రామ పంచాయతీలకు పౌరులు ఇంటి పన్నులను ఆన్‌లైన్లో చెల్లించే సదుపాయం కల్పించినట్లు తిరువూరు డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్ తెలిపారు. మండలంలోని చౌటపల్లిలో స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా పన్నుల చెల్లింపు విధానంపై సచివాలయ, పంచాయతీ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలో చెత్త సేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలుపై తగు సూచనలిచ్చారు. ఎంపీడీవో రవిబాబు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

మైలవరం: మైలవరం శాంతినగర్‌లో మైనర్ బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. మైలవరం శాంతినగర్‌లో నివసిస్తున్న సింధే బాజీకి ఇద్దరు భార్యలు. రెండవ భార్య నాగేంద్రం కుమార్తె గాయత్రి గత రెండు రోజులుగా కన్పించడం లేదు. తండ్రి బాజీ కుమార్తెను తీసుకువెళ్లాడని స్థానికులు చెబుతున్నారు. తన కుమార్తె గాయత్రి కన్పించడంలేదని తల్లి నాగేంద్రం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మండల పరిషత్ సాధారణ సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన గురువారం స్థానిక వెలుగు కార్యాలయం మీటింగ్‌హాలులో నిర్వహించారు. సంబంధిత అధికారులు చేపడుతున్న పనుల గురించి వివరించారు. ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, తహసీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తిరువూరు బార్‌కు దరఖాస్తు చేసుకోండి

తిరువూరు: తిరువూరులో ఏర్పాటు చేయనున్న బార్ లైసెన్సు పొందడానికి ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవచ్చని తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ తెలిపారు. ఈ నెల 14వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్లో దరఖాస్తు రుసుము రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించి దరఖాస్తులను విజయవాడలోని మారుతీనగర్‌లో ఎన్టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు.

నేటి నుంచి విజయవాడ ప్రీమియర్ లీగ్ పోటీలు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో ఈ నెల 5 నుంచి విజయవాడ ప్రీమియర్ లీగ్ క్వాలిఫైడ్ టోర్నమెంట్–2025 పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. క్రీడాకారులకు వయసు 17 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9666441111ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీ

సాక్షి స్పందన

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లాలో ఎరువులకు కొరత లేదని, కృత్రిమ కొరత సృష్టికి అధికారులే బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. 'సాక్షి'లో గురువారం 'యూరియా కోసం రైతుల పడిగాపులు' శీర్షికన వచ్చిన వార్తకు స్పందించిన కలెక్టర్ తిరువూరు నియోజకవర్గంలోని గ్రోమోర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎ.కొండూరు మండలం కంభంపాడులో, తిరువూరు పట్టణంలో గ్రోమోర్ కేంద్రాల వద్ద యూరియా కోసం వేచివున్న రైతులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన ఎరువులను సరఫరా చేసిందని, ఎక్కడైనా కృత్రిమ కొరత ఉన్న సంఘటనలు ఎదురైతే అందుకు అధికారులే బాధ్యత వహించాలని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ అనంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. అధికారులు నిరంతరం ఎరువుల దుకాణాల వద్ద పర్యవేక్షణ జరిపి రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులను నివారించాలన్నారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై నిఘా ఉంచాలని కూడా ఆదేశించారు. యూరియా, నానో యూరియా వినియోగంపై అధికారులకు రైతులు అవగాహన కల్పించాలని సూచించారు. తిరువూరు ఆర్డీఓ మాధురి, తిరువూరు, ఎ.కొండూరు తహసీల్దార్లు ఉదయభాస్కర్, లక్ష్మి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.



తిరువూరు గ్రోమోర్ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో ఆర్డీఓ, ఇతర అధికారులు

యూరియా పంపిణీలో అవకతవకలు సహించం

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): సన్నచిన్నకారు రైతులకు అందాల్సిన యూరియాలో అవకతవకలకు పాల్పడితే సహించబోమని ఆర్డీఓ కావూరి చైతన్య హెచ్చరించారు. మండలంలోని ఈలప్రోలు పీఏసీఎస్ రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. యూరియా పంపిణీలో ఈ-పాస్, బిల్లులు, గ్రౌండ్ బ్యాలెన్స్ సమంగా ఉండాలన్నారు. రైతులు నానో యూరియాను రెండు, మూడు దఫాలుగా డ్రోన్ సహాయంతో స్ప్రే చేయాలని తెలియజేశారు. యూరియా కోసం రైతులు కంగారు పడవద్దని, అవసరమైతే మళ్లీ రప్పిస్తామన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలు, మూలపాడు సొసైటీలో యూరియా పంపిణీని మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి యడవల్లి రజని తనిఖీ చేశారు.

ఎరువుల పంపిణీని పరిశీలించిన అధికారులు

మైలవరం: మైలవరం వ్యవసాయ శాఖ డివిజన్‌లోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో యూరియా ఎరువుల పంపిణీ తీరుతెన్నులను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, మన గ్రోమోర్ సెంటర్, కామధేను మెన్యూర్ డిపో, మొర్సుమల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, మన గ్రోమోర్ సెంటర్, జి.కొండూరు, సాయి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, జి.కొండూరు, పీఏసీఎస్ వెలగలేరు, పీఏసీఎస్ ఈలప్రోలు దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు అమ్మిన వెంటనే ఈ–పోస్‌లో నమోదు చేయాలని షాపు యజమానులు, పీఏసీఎస్ సీఈఓలకు సూచించారు. ఈ–పోస్ బ్యాలెన్స్, గోడౌన్‌లో స్టాకు, సరిపోయిందీ లేనిదీ తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువులు బ్లాక్ చేసి అమ్మినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డివిజన్‌లో మూడు మండలాలకు 200 టన్నులు ఇండెంట్ పెట్టామని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.



ఈలప్రోలు సొసైటీలో యూరియా పంపిణీ సందర్భంగా రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కావూరి చైతన్య, ఏఓ రజని

ఉపాధ్యాయుడే సమాజానికి దిక్సూచి

నూజివీడు: మండలంలోని మద్దాయికుంట హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు దేశ ప్రథమ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో...

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం డీవీఎల్ పుష్పలత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులైన వి.పద్మ, డి.మోహన్‌రావులను డీవైఈవో పీఎస్ సుధాకర్ ఘనంగా సన్మానించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై...

తిరువూరురూరల్: గురుపూజోత్సవం సందర్భంగా తిరువూరు మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. చిట్టేల జెడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం ఎంపీపీ స్కూలు, చింతలపాడు ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగొలనులో షిర్డిసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



నూజివీడులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీవైఈఓ, ఎంపీడీఓ, ఎంఈఓలు



తిరువూరు మండలం లక్ష్మీపురం ఎంపీపీ స్కూలులో ఉపాధ్యాయినిగా విద్యార్థిని

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం గురువారం నిర్వహించారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొని మున్సిపాలిటీ, మండలం పరిధిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన వారికి అవార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. శాలువాతో సత్కరించి అభినందించారు. ఎంఈఓ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చాట్రాయి: మండలంలోని పోలవరం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల బదిలీ అయిన హైస్కూలు ఉపాధ్యాయులు పి.రత్తయ్య, కె.కృష్ణారావు, విజయ్ కుమార్‌లకు తోటి ఉపాధ్యాయులు సన్మానం చేశారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్ శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సత్తెనపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

నూజివీడు: ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, దాని గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీవైఈఓ పీఎస్ సుధాకర్ అన్నారు. పట్టణంలోని డీవైఈవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 11మంది సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంఈఓలు మందా దేవవరప్రసాదరావు, సంగెపు జమలయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

మైలవరం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డిపై గుంతకల్లు ఎమ్మెల్యే జి.జయరాం అసభ్య పదజాలంతో దూషించడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నూజివీడు రోడ్డులో గురువారం నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పీ.వీ.ఆంజనేయులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తి, పామిడి మండలాల పరిధిలో ఐదు గ్రామాల పరిధిలో సోలార్ విండ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం చేసిన భూసేకరణను పరిశీలించడానికి వెళ్లే ప్రజలతో మాట్లాడుతూ ఉండగా రైతు సంఘం నాయకులను ఎమ్మెల్యే జయరాం అసభ్య పదజాలంతో దూషించి, చంపేస్తామంటూ బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వజ్రాల ధనలక్ష్మి, వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు చిలుకూరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆయకట్టులోని చెరువులను నింపుకోండి

నూజివీడు: నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు తెలంగాణ నుంచి వస్తున్న సాగర్ వరద జలాలతో ఆయకట్టులోని తాగునీటి చెరువులు నింపుకోవాలని ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ గోపాలకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని రావిచర్ల వద్ద ఉన్న బాపులపాడు మేజర్ రెగ్యులేటర్ వద్ద నుంచి విడుదలవుతున్న సాగర్ జలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆళ్ల మాట్లాడుతూ బాపులపాడు మేజర్‌కు ప్రస్తుతం 60 క్యూసెక్కుల సాగర్‌జలాలు మాత్రమే వస్తున్నాయని, వీటిని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు పల్లగాని వెంకట నాగేంద్రరావు, తమ్మిశెట్టి రాంబాబు, నూజివీడు ఎన్నెస్పీ డీఈ కె.సీతారావమ్మ, ఏఈలు కె.ప్రసన్నకుమార్, వై.నవీన్ బాబు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద యూరియా స్టాక్ రావటంతో గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. మహిళలు కూడా యూరియా కోసం సొసైటీ వద్ద క్యూలో వేచి ఉన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్సులు పరిశీలించి రైతులకు యూరియా పంపిణీ చేయటంతో గంటల తరబడి రైతులు యూరియా కోసం ఎండలో ఉండాల్సి వచ్చింది. ఈ విషయమై ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో తీసుకున్న వారు ఎంత తీసుకున్నారు, ఇంకా ఎంత ఇవ్వాలని పరిశీలించి యూరియా ఇస్తున్నామని, అందువల్ల కొంత జాప్యం జరుగుతోందన్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.



యూరియా కోసం పుట్రేల సొసైటీ వద్ద వేచి ఉన్న రైతులు, మహిళలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అంకం వెంకటేశ్వరరావు

ఆగిరిపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి మండలంలోని ఈదులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అంకం వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఆయన్ను ఎంఈఓలు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



గణనాథుని నిమజ్జనం

తిరువూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరువూరులోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గురువారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వర కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా జరిపిన అనంతరం భక్తులకు అన్నదానం చేసిన నిర్వాహకులు ప్రత్యేక వాహనాల్లో స్వామివారి ప్రతిమలను మేళతాళాలు, కోలాట నృత్యాలతో నిమజ్జనానికి సాగనంపారు. తిరువూరు రాజుపేట, బెస్తబజారు, సుందరయ్య కాలనీ, నాగార్జున స్కూల్ సెంటర్, జయకృష్ణ హాస్పిటల్ సెంటర్లలోని వినాయక విగ్రహాలను కట్టలేరులో నిమజ్జనం చేశారు.

వడ్లమానులో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. వడ్లమానులో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో 2వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. ఆగిరిపల్లి, నూగుండపల్లిలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో వడ్లమాను ఎంపీటీసీ రాణి మేకల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కుప్పాల నాగరాజు, సర్పంచ్ జలసూత్రం వంశీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ

మైలవరం: మైలవరం మండలం చిలుకూరివారిగూడెం క్లస్టర్ పరిధిలోని దాసుళ్ళపాలెం పాఠశాల విద్యార్థులకు వెల్వడం సరస్వతీ సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, యూఎస్ఏ, వారు కుదుముల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం గురువారం క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు కుసుమకుమారి, ఫౌండేషన్ కన్వీనర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఎ.పుల్లారెడ్డి, ఎం.వెంకటేష్, సీహెచ్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వెరిఫికేషన్ నిలిపివేయాలి

ఇబ్రహీంపట్నం: దివ్యాంగులను వెరిఫికేషన్ పేరుతో పీడిస్తున్న అధికారుల చర్యలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం శక్తినగర్‌లో దివ్యాంగుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ తొలగింపు చర్యలు మానుకోవాలన్నారు. వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చదువుకున్న దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోట దానియేలు మాదిగ, నూర్ బాషా, సీఐటీయూ నేత మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద గురువారం అన్నసమారాధనలను నిర్వహించారు. ఎంప్లాయీస్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో అన్నసమారాధనను నిర్వహించారు. నందనం తోటలోని జమ్మి మండపం వద్ద, సుతార్ల రామమందిరం వద్ద, ఢంఢం గార్డెన్ రోడ్డులో, సిబ్బంది పేటలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు.

మద్దాయికుంట ప్రాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

నూజివీడు: మండలంలోని మద్దాయికుంట మోడల్ ప్రైమరీ స్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం తొమ్మండ్రు యువరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, జ్యోతి, జయప్రద, దానియేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల దుష్ఫలితాలపై అవగాహన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): సమాజంలో మత్తు పదార్థాల వలన కలుగుతున్న దుష్ఫలితాలపై గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో బాలభవన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు విక్రయించినా కొనుగోలు చేసినా చట్టపరిధిలో నేరస్తులు అవుతారని తెలియజేశారు. మత్తుకు బానిసలుగా మారిన వ్యక్తులు బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.













